తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. పక్కన బాల్క సుమన్, గువ్వల బాలరాజు

గురుకులాలను ధ్వంసం చేసే కుట్ర

- రేవంత్ నియంత పోకడతో దళిత పిల్లలే సమిధలు
- 2,000 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు రోడ్డుపాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోవద్దా?
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం
- రేవంత్ రక్తంలోనే నియంతృత్వ ఆలోచన : బాల్క
- కేసీఆర్ గుర్తులు చెరపలేరు గువ్వల బాలరాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నాడు కేసీఆర్ హయాంలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించిన గురుకులాలను నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధ్వంసం చేయాలని కుట్రలు పన్నుతున్నదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి నియంత పోకడలతో దళిత బిడ్డలే సమిధలు అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గువ్వల బాలరాజుతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ గురుకులాల్లోని 2,000 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఇతర సిబ్బందిని రాత్రికి రాత్రే ఒక్క జీవోతో ఉద్యోగాల నుంచి తొలగించారని మండిపడ్డారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవానికి ఒక్కరోజు ముందే టీచర్ల జీవితాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మట్టిగొట్టి, వారి కుటుంబాలను రోడ్డు పాల్జేశారని విమర్శించారు. నిబంధనలకు లోబడి నియామకాలు జరిగిన వారిని ఎలా తొలగిస్తారని నిలదీశారు. తక్షణమే తొలగించిన ఆ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గతంలో ఇంజినీర్లు, డాక్ట ర్లు, నేవీ ఆఫీసర్లు అయితే.. ఇపుడు మళ్లీ పశువులు కాసే పరిస్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. వెయ్యి మంది డాక్టర్లను తయారుచేసిన గౌలిదొడ్డి గురుకులంలో ఇప్పుడు ఉపాధ్యాయులు సమ్మె చేసే పరిస్థితిని తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

తిరుపతికి ఆర్థికసాయం చేస్తారా.. లేదా?

అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు తిరుపతికి రూ.2 లక్షల సాయం అందించని ప్రభుత్వం ఎందుకని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. తిరుపతికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయకపోతే తానే సాయం చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతుల పిల్లలు చదువుకోవద్దా? అని ప్రశ్నించారు. అన్ని వర్గాలవారు మేల్కొని రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కుట్రల నుంచి గురుకులాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ గుర్తులను చెరపాలనే కుట్రలో భాగంగానే గురుకులాల ధ్వంసరచన చేస్తున్నారని, ఏనాటికీ ఆయన గుర్తులను చెరపలేరని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన గురుకులాలను దెబ్బతీస్తే 10 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అంధకారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి రక్తంలోనే దేశ్‌ముఖ్, రాజరికం, నియంతృత్వ ఆలోచనలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలకు వరంగా మారిన గురుకులాల నిర్వీర్యానికి రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. గురుకులాల పరిరక్షణ బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామని తెలిపారు.

రాత్రికి రాత్రే రోడ్లమీద పడేస్తరా?

- అర్ధాంతరంగా తొలగిస్తే మా బతుకులు ఏంకావాలి?
- ఎస్సీ గురుకుల సొసైటీ ఎదుట పార్ట్‌టైం టీచర్ల ధర్నా
- పట్టించుకోకుండా వెళ్లిన సెక్రటరీ
- టీచర్ల ఆగ్రహం, హెచ్చార్సీకి ఫిర్యాదు
- హరీశ్‌రావును కలిసి గోడు వెళ్లబోసుకున్న సిబ్బంది
- అప్పటికప్పడే సీఎం రేవంత్‌కు లేఖ

హైదరాబాద్‌లో బుధవారం బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీలు, ఇతర సిబ్బంది

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ) : 'ఆరేడేండ్లుగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నం.. ఈ ఏడాది కూడా మా సర్వీసులను కొనసాగిస్తూ జూన్‌లోనే సెక్రటరీ ఉత్తర్వులిచ్చిండ్రు.. అనేక చోట్ల భారీగా ఖాళీలున్నా మమ్మల్ని అర్ధాంతరంగా విద్యా సంవత్సరం మధ్యలో రాత్రికి రాత్రే తొలగించడంలో ఆంతర్యమేమిటి?..వుయ్ వాంట్ జస్టిస్.. మమ్మల్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.. మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి' అంటూ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీల్లోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లు, నాన్ సీవోఈలు, ప్రత్యేక, వొకేషనల్ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం సిబ్బంది, గెస్ట్ ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు డిమాండ్ చేశారు. తమను తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సొసైటీ తక్షణం వెనక్కి తీసుకోవాలని నినదించారు. ఎస్సీ గురుకులాల్లోని పార్ట్‌టైం సిబ్బందిని తొలగిస్తూ సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ వారంతా మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌కు బుధవారం భారీగా తరలివచ్చారు. సొసైటీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, సెక్రటరీని వెంటనే తొలగించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ తాము రెగ్యులర్ ఉపాధ్యాయలతో సమానంగా పనిచేస్తూ చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. గత సెక్రటరీలతో ఎన్నడూ తమకు ఇబ్బంది రాలేదని, తమ శ్రమను గుర్తించి అభినందించారు తప్ప ఎప్పుడూ చేటు చేయలేదని వివరించారు. ప్రస్తుత సెక్రటరీ వచ్చాకే తమకు కష్టాలు మొదలయ్యాయని, అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ ఏడాది కూడా తమ సర్వీసులను కొనసాగిస్తూ జూన్‌లోనే సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి ఉత్తర్వులిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు మైనార్టీ, ఎంజేపీ, ట్రైబల్ ఇలా ఏ గురుకుల సొసైటీలో లేనివిధంగా కేవలం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలోనే పార్ట్ టైం, గెస్ట్ ఫ్యాకల్టీలను రాత్రికి రాత్రే తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. రెగ్యులర్ స్టాఫ్ వస్తున్నారని సెక్రటరీ చెబుతున్నా గురుకులాల్లో అనేక చోట్ల భారీగా ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. అయినా తమను అర్ధాంతరంగా, విద్యాసంవత్సరం మధ్యలో రాత్రికి రాత్రే తొలగించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నంటి ఉండి గెలిపించుకున్నందుకు తమకు తగిన శాస్తి జరిగిందని వాపోయారు. సెక్రటరీ నిర్ణయం వల్లే తమ కుటుంబాలు రోడ్డు పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సొసైటీ గేటుకు తాళం

తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు ఉదయం నుంచి డీఎస్ఎస్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్నా సోషల్‌వెల్ఫేర్ సెక్రటరీ వర్షిణి, సొసైటీ ఉన్నతాధికారులెవరూ స్పందించలేదు. అదీగాక పోలీసులకు సమాచారమిచ్చి వారిద్వారా సదరు సిబ్బంది ఎవరూ సొసైటీ కార్యాలయం లోనికి రాకుండా గేటు వద్దే అడ్డగించారు. సొసైటీ గేట్లకు సైతం తాళం వేశారు. అయినా ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో సొసైటీ అధికారులు ఓ ఐదుగురిని లోపలికి పిలిపించుకున్నారు. సెక్రటరీ వచ్చి మాట్లాడతారని చెప్పి దాదాపు అరగంటసేపు వెయిట్ చేయించారు. వారు అక్కడ కూర్చుని ఉన్నా.. భవన్ ఎదుట ధర్నా కొనసాగుతున్నా ఆదేమీ పట్టించుకోకుండా మళ్లీ వస్తానని చెప్పి గురుకుల సొసైటీ సెక్రటరీ వర్షిణి మరో గేటు ద్వారా వెళ్లిపోయారు. దీంతో పార్ట్‌టైం సిబ్బంది మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యమా? అంటూ నిప్పులు చెరిగారు. అక్కడి నుంచి నేరుగా మానవ హక్కుల కమిషన్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఒక్క డీఎస్ఎస్ భవన్ వద్దే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఆయా జోనల్ ఆఫీసర్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు.

సిబ్బందిని కొనసాగించాలి: కొప్పుల

కరీంనగర్ కార్పొరేషన్: గురుకుల పాఠశాలల గెస్ట్, పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాల్సిందేనని, వారిని తీసేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం ఓ ప్రకటన హెచ్చరించారు. ఓవైపు సరైన వసతులు కరువై గురుకులాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే, విద్యా సంవత్సరం మధ్యలో ఉన్నఫలంగా టీచర్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పాతవారిని తొలగించి, కొత్తవారి వద్ద రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ఉన్నతాధికారులు అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో దాదాపు 2లక్షల మంది ఎస్సీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని విచారం వ్యక్తం చేశారు.

గద్వాలలో నిరసన

గద్వాల: తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట గురుకులాల పార్ట్ టైం టీచర్లు, గెస్ట్ ఫ్యాక్టల్టీ, పీఈటీలు బుధవారం ఆందోళన చేపట్టారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న తమను అకస్మాత్తుగా తొలగించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.

తొలగింపు అప్రజాస్వామికం : ఏఐవైఎఫ్

హైదరాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో పనిచేస్తున్న 6 వేల మంది పార్ట్ టైమ్ టీచర్లను, 33 సీఓఈల్లో పనిచేస్తున్న 216 సబ్జెక్ట్ అసోసియేట్ టీచర్లను తొలగించడం దారుణమని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మండిపడ్డారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వారినే విధుల్లోకి తీసుకుంటాం..

'నమస్తే' కథనంతో సెక్రటరీ ప్రకటన • తాత్కాలికంగా పక్కన పెట్టామని వివరణ

హైదరాబాద్: తొలగించిన ఉద్యోగులనే మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణి ప్రకటించారు. సొసైటీ ఉత్తర్వులపై 'గురుకుల గెస్ట్ లెక్చరర్లు వెయ్యిమందిపై వేటు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో బుధవారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గురుకుల సొసైటీ కొత్తగా రెగ్యులర్ ఉద్యోగుల నియామకాలను చేపట్టిందని, బదిలీలు కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పార్ట్‌టైం, గౌరవవేతనంపై పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ సిబ్బందిని తాత్కాలికంగా తొలగించామని వెల్లడించారు. గురుకులాల్లో మిగిలిన ఖాళీల వివరాలను ప్రిన్సిపాళ్ల నుంచి తెప్పించుకొని, అవసరాల మేరకు తిరిగి నాన్ రెగ్యులర్ ఉద్యోగులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. అంతేగాని పూర్తిగా తొలగిస్తున్నట్టు ఆదేశాలివ్వలేదని స్పష్టం చేశారు.

మీరిచ్చే కానుక ఇదేనా రేవంత్?

- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్: ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల తొలగింపు అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఉద్యోగాలు కోల్పోయిన పలువురు హరీశ్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకోగా ఆయన వెంటనే స్పందించారు. సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్ టైమ్ టీచర్లు, పార్ట్ టైం లెక్చరర్లు, డీఈవోలను ఏకకాలంలో విధుల నుంచి తొలగించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సెప్టెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం టీచర్లకు అదనపు ప్రోత్సాహకాలు అందిచడం ఆనవాయితీ అని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యాబుద్ధులు నేర్పే గురువులను అర్ధాంతరంగా తొలగించి వారికి, వారి కుటుంబాలకు అంతులేని క్షోభను కలిగించిందని నిప్పులు చెరిగారు. 3నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, అడిగిన పాపానికి ఏకంగా వారిని ఉద్యోగాల నుంచే తొలగించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. ఐఐటీ, ఎన్ఐటీ కోచింగ్‌ను పునరుద్ధరించాలని, తొలగించిన పార్ట్ టైమ్ లెక్చరర్లు, టీచర్లందరినీ విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

సొసైటీలో జరుగుతున్నదేమిటి?

- 3 నెలలుగా అర్థం కాని పరిస్థితి!
- ప్రభుత్వ విధానమా? సొంత నిర్ణయమా?
- ఓ వైపు విద్యార్థులకు అసౌకర్యాలు
- మరోవైపు ఆందోళనలో గురువులు
- నిర్ణయాల్లో ఓ ఉన్నతాధికారి కీరోల్
- ఇటీవల డిప్యూటీ సీఎం చీవాట్లు

మాసబ్ ట్యాంక్‌లోని ఎస్సీ గురుకుల సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మైనార్టీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ, జనరల్ కలుపుకొని మొత్తం 1022 పైగా గురుకులాలున్నా ఒక్క ఎస్సీ సొసైటీలోనే అనేక వివాదాలు చెలరేగుతున్నాయి. 3నెలలుగా తారాస్థాయికి చేరాయి. ఇటీవల ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలు రాష్ట్రమంతటా ఆందోళన కలిగించగా, తాజాగా ఎస్సీ గురుకుల సొసైటీలోని ఉద్యోగులు వివిధ అంశాలపై రోడ్డెక్కడం చర్చనీయాంశమైంది. ఈ సొసైటీపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా సర్కారు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. వివాదాలకు దారితీస్తున్న నిర్ణయాలన్నీ ప్రభుత్వానివేనా? లేక సొసైటీ సెక్రటరీ, ఉన్నతాధికారుల సొంత విధానాలా? అని ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్లు చర్చించుకుంటున్నాయి.

వరుసగా వివాదాలు

- ఎస్సీ సొసైటీ పరిధిలో ఇటీవల వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు నమోదయ్యాయి. సమస్యలకు తాళలేక విద్యార్థులే రోడ్డెక్కుతున్న దుస్థితి నెలకొన్నది.
- అన్నిశాఖలు చేపట్టిన మాదిరిగానే గురుకుల సొసైటీలోనూ ఇటీవల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహించారు. కానీ ఏ సొసైటీలో లేనివిధంగా ఎస్సీ గురుకుల సొసైటీలోనే ఈ అంశం తీవ్ర వివాదాస్పదమైంది. జీవో 80 ప్రకారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా కాకుండా ఎస్సీ గురుకుల సొసైటీలో మాన్యువల్‌గా ప్రక్రియ నిర్వహించడమే అందుకు కారణమని తెలుస్తున్నది. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా ఎలా నిర్వహించారని అడిగితే సొసైటీ వద్ద సమాధానం లేదు. అదేమంటే అసోసియేషన్ల సూచనతో చేశామని సొసైటీ ఉన్నతాధికారులు బదులిచ్చి చేతులు దులుపుకొన్నారు. బదిలీలు, ప్రమోషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి.
- రాత్రికే రాత్రే ఎస్సీ సొసైటీలోని 317 జీవో బాధిత ఉద్యోగులు, మెరిట్ ఆధారంగా డిస్ లొకేట్ అయినవారిని ఎలాంటి పోస్టింగ్ లేకుండా రిలీవ్ చేశారు. వారంతా ఆందోళనకు దిగారు. ధర్నాకు దిగిన ఓ టీచర్‌ను సస్పెండ్ చేయడంతోపాటు, 144 మంది టీచర్లకు వార్నింగ్ లెటర్లను జారీ చేసి మరో వివాదానికి అధికారులు తెరలేపారు. బాధిత టీచర్లందరూ ప్రజాభవన్, ఆపై సీఎంవో అధికారుల వరకూ వెళ్లారు. ఆ తర్వాత సొసైటీ అధికారులు ఎక్కడి వారిని అక్కడే కొనసాగిస్తామంటూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.
- ప్రమోషన్లు, బదిలీలు కొనసాగుతున్న క్రమంలోనే సెలవుల మంజూరు నిబంధనలన్నింటినీ సొసైటీ అధికారులు మార్చారు. ఆర్సీవోలు, జోనల్ ఆఫీసర్లకు, ఆపై జాయింట్ సెక్రటరీలకు మొత్తం అధికారాలను కట్టబెట్టారు. దీంతో గురుకుల ప్రిన్సిపాళ్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతున్నది. ఇదో వివాదాన్ని రేపింది.
- తాజాగా ఎస్సీ గురుకులాల్లోని నాన్ రెగ్యులర్ సిబ్బందిని తొలగించడం మరోవివాదానికి దారి తీసింది.
- ఇక సొసైటీ ఉన్నతాధికారులు ఏ ఆదేశాలు జారీ చేసినా అర్ధరాత్రే అమలు చేస్తున్నారు. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించినవే కాకుండా ఆఖరికి పత్రికల్లో వచ్చిన కథనాలపై వివరణాలను సైతం అర్ధరాత్రే ఇవ్వడం గమనార్హం.

సొసైటీలో పవర్ సెంటర్లు..

వరుస వివాదాలకు సొసైటీ ప్రధాన కార్యాలయంలో పవర్ సెంటర్లుగా మారిన కొందరు ఉన్నతాధికారులే కారణమని ఉద్యోగులు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రధానంగా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ ఉన్నతాధికారిపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వచ్చిన సెక్రటరీని పూర్తిగా తప్పుదోవపట్టిస్తూ తప్పుడు నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారని సిబ్బంది వివరిస్తున్నారు. కావాల్సినవారికి ప్రధాన కార్యాలయంలోనే డిప్యూటేషన్లు ఇప్పించుకుని వారితో వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నారని, ప్రశ్నిస్తే కక్షసాధింపులకు దిగుతున్నారని ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. ఇటీవల సదరు ఉన్నతాధికారి అతిపై డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు, వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించినట్టు సమాచారం.

సర్కారు మొద్దునిద్ర

సొసైటీలో వరుస వివాదాలు తలెత్తుతున్నా సర్కారు మొద్దు నిద్ర వీడడం లేదు. జీవోలకు వ్యతిరేకంగా సొసైటీ ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నా సర్కార్ స్పందించకపోవడంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెదవివిరుస్తున్నారు. సొసైటీ ఉన్నతాధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

టీవీవీపీలో ఉద్యోగుల కొనసాగింపు

- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఊరట
- 2,600 మందిని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనానికి స్పందన

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ)లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 'పనిచేస్తున్నాం.. వేతనం ఇస్తారా?' అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఆగస్టు 31న ప్రచురితమైన ప్రత్యేక కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 2,600 మంది ఉద్యోగులను ఈ ఆర్థిక సంవత్సరం కొనసాగిస్తూ బుధవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. వీరిలో 945 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో, 1,562 మంది ఔట్ సోర్సింగ్, 93 మంది ఎంటీఎస్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఉద్యోగుల కొనసాగింపు ఉత్తర్వులు రావాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ పేరిట మూడు నెలల కొనసాగింపుతో జారీ అయిన ఉత్తర్వులు జూన్‌తోనే ముగిశాయి. జూలై, ఆగస్టు నెలల్లో ఉత్తర్వులు లేకున్నా పనిచేయాల్సి వచ్చింది. దీంతో చేసిన పనికి వేతనం వస్తుందో.. లేదో? అని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. వారి వేదనను వివరిస్తూ 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించి కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేసింది. దీనిపై తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తంచేసింది.

117 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేసే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఈ ఏడాది 117 మందిని వరించాయి. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం వేర్వేరు జీవోలు విడుదల చేశారు. ఉన్నత విద్యలో అత్యధికంగా 55 మంది అధ్యాపకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. పాఠశాల విద్యలో 47, ఇంటర్ విద్యలో 11 మంది, సాంకేతిక విద్యలో నలుగురిని అవార్డులు వరించాయి. రూ.10వేల నగదు, సర్టిఫికెట్, మెడల్‌ను అందజేయడంతోపాటు రవీంద్ర భారతిలో గురువారం వీరిని సన్మానిస్తారు. విద్యాశాఖ మంత్రి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరుకానున్నారు. మోడల్ స్కూల్ టీచర్లు, డైట్ కాలే జీ లెక్చరర్లు, కేజీబీవీ టీచర్లను పరిగణనలోకి తీసుకోకపోవడంపై గెజిటెడ్ హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభానుచంద్రప్రకాశ్, పలువురు అసంతృప్తి వ్యక్తంచేశారు. అవార్డుల కోసం పైరవీలు సాగినట్టు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మరో ఆ రుగురుతో ఇంకో జాబితా విడుదలైం ది. పెద్ద ఎత్తున ఒత్తిడి వల్లే మరో ఆరుగురికి చోటు కల్పించినట్టు సమాచారం.

పీఈటీల తుది ఫలితాలు ఎప్పుడో!

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గురుకుల పీఈటీ ఫలితాలు విడుదల చేశారు.. కానీ రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇచ్చి.. ఆ తర్వాత తుది ఫలితాలు విడుదల చేయడం లేదని టీజీపీఎస్సీ అధికారులపై బాధిత అభ్యర్థులు మండిపడుతున్నారు. పీఈటీ పోస్టుల కోసం ఇప్పటికే ఎనిమిదేండ్ల నుంచి ఎదురు చూస్తున్నామని, ఇంకెన్నేండ్లు చూడాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇచ్చిన తర్వాత పోస్టులకు ఎంతమంది ముందుకు వచ్చారు? ఎన్ని పోస్టులు ఉన్నాయనే విషయంలో స్పష్టత ఇవ్వాలని, దీంతో పోస్టింగ్‌లో మార్పులకు అవకాశం ఉంటుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. న్యాయం కోసం టీజీపీఎస్సీ ఎదుట రేపు(6న) ధర్నా చేస్తామని తెలిపారు.

రేవంత్‌రెడ్డి ఇలాకాలో బడుగులపై దాష్టీకం

- ఇంటి స్థలం కబ్జాకు యత్నం
- అడ్డొచ్చిన యువకుడిపై దాడి
- తీవ్రంగా గాయపడి ప్రైవేట్ దవాఖానలో చికిత్స
- బాధితుడు ఆర్మీ జవాన్: యాదవ సంఘం నేత రాములుయాదవ్

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న యాదవసంఘం నేత రాములుయాదవ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 4: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో బీసీ వర్గాలపై అగ్రవర్ణాలకు చెందిన దుండగులు దాష్టీకానికి ఒడిగట్టారు. ఆరుగాలం కష్టపడి స్థలం కొనుక్కొని 20 ఏండ్ల క్రితం ఇల్లు కట్టుకొని జీవిస్తున్న ఓ కుటుంబంపై దాడి చేసి బలవంతంగా కబ్జా చేసేందుకు యత్నించారు. అడ్డొచ్చిన కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడులు చేసి గాయపర్చారు. వారి దాడిలో గాయపడిన ఇంటి యజమాని కొడుకు ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఘటన వివరాలను యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ హైదరాబాద్‌లో వెల్లడించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన బాధితులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కొడంగల్‌లోని మద్దూరు మండలం చింతల్‌దిన్నె గ్రామంలో మండి భీమప్పయాదవ్ 20 ఏండ్ల క్రితం 999 గజాల స్థలం కొనుగోలు చేశాడని తెలిపారు. అందులో చిన్న ఇల్లు కట్టుకొని

చికిత్స పొందుతున్న శ్రీనివాస్ యాదవ్

భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడని చెప్పారు. గ్రామానికి చెందిన పల్లె చిన్న అనివిరెడ్డి, పల్లె వెంకట్‌రెడ్డి, పల్లె బుగ్గారెడ్డి, పల్లె రాజశేఖర్‌రెడ్డి, పల్లె రాజిరెడ్డి, పల్లె విష్ణువర్ధన్‌రెడ్డి ఆ భూమిపై కన్నేసి ఆక్రమించుకోవాలన్న కుట్రజేశారని చెప్పారు. గత నెల 25న ఆ ఇంటిపై దాడి చేసి భీమప్ప భార్య, ఆర్మీ జవాన్‌గా పనిచేస్తూ సెలవుల్లో వచ్చిన కొడుకు మండి శ్రీనివాస్‌యాదవ్‌పై దాడిచేశారని వివరించారు. వారి దాడిలో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. దాడికి పాల్పడిన వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉన్నదని, ముఖ్యమంత్రి నియోజకవర్గంలో బడుగులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మీ జవాన్‌పై దాడిచేయడం సిగ్గుచేటని, తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో యాదవ సంఘాలన్నింటినీ ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు.

ప్రాణహాని ఉంది: బసమ్మ

ప్రభుత్వ రికార్డుల్లోనూ తమ పేరిటే స్థలం ఉన్నదని, ఆస్తి పన్నుతోపాటు విద్యుత్తు బిల్లులు చెల్లిస్తున్నామని మండి భీమప్పయాదవ్ భార్య, బాధితురాలైన బసమ్మ తెలిపారు. ఈ నెల 25న తమపై దాడి చేసిన వెంటనే మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారితో ప్రాణహాని ఉన్నదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి న్యాయం చేయాలని కోరారు.

'కడా' పరిహారంలో ఎందుకీ తేడా?

- కొడంగల్ భూ బాధితులకు తీరని అన్యాయం
- పరిహారం ఎకరాకు 10 లక్షలు.. ఇచ్చింది కేవలం 6 లక్షలే
- పంపిణీలో గందరగోళం.. ఆందోళనలో అన్నదాతలు

కొడంగల్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు, నాయకులు

కొడంగల్, సెప్టెంబర్ 04: ఎకరాకు ఇంటి స్థలం సహా రూ.10 లక్షలు ఇస్తామన్నరు.. తీరా రూ.6 లక్షలే ఇచ్చారు. రెండెకరాలుంటే రూ.15 లక్షలే ఇచ్చారు.. అని సీఎం ఇలాకాలోని బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని కడా (కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో అప్పాయిపల్లిలోని సర్వే నం 19కి సంబంధించిన రైతులకు ఎకరానికి రూ.10 లక్షలతోపాటు ఇంటి స్థలం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ కూడా పాల్గొన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపుల్లో గందరగోళం నెలకొన్నది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కాకుండా అరకొరగా పంపిణీ చేసినట్టు రైతులతోపాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. సీఎం ఇలాకాలోనే ఇలా చేయడం అధికారుల నిర్లక్ష్యమా, పాలకుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 నుంచి 25 మంది రైతులకు ఎకరాకు రూ.10 చొప్పున లక్షలు రావాల్సి ఉండగా రూ.6 లక్షలు, రూ.20 లక్షలు రావాల్సిన వారికి రూ.15 లక్షల చొప్పున అందించారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్ అభివృద్ధిని ఆశించి రైతులు సాగు భూమిని ప్రభుత్వానికి అప్పగించామని, తమకు తక్కువ పరిహారం ఎలా ఇస్తారని రైతులు ఎరన్‌పల్లి శ్రీనివాస్, వెంకటయ్య, చంద్రయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారంరోజుల్లో విచారణ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు ఫకీరప్ప, మోతీబాయి, పుష్పమ్మ, పల్లేశ్, రాములుగౌడ్, యశోద, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.